ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం: 34.0 కనిష్ఠం: 21.0

ANDHRAJYOTHY 5



నారాయణపేట

జిల్లా వార్తలు

శుక్రవారం 28 ఫిబ్రవరి 2025

కొత్త టీచర్లకు శిక్షణ

- నేటి నుంచి ప్రారంభం
- పేట జిల్లాలో 246 మంది ఉపాధ్యాయులు

6



పేట జిల్లాలో కొత్త టీచర్లకు నియామక పత్రాలు అందిస్తున్న డీఈవో గోవిందురాజులు (ఫైల్)



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు టీఎన్ శ్రీధర్ (ఫైల్)

ఇంట్లోనే సైన్స్ ల్యాబ్

- ఏర్పాటు చేసిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు టీఎన్ శ్రీధర్
- విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే ఆయన లక్ష్యం
- నేడు జాతీయ సైన్స్ దినోత్సవం

7

పరికరాలను పరిశీలించిన అధికారులు

- మూలకు మురిపెంగా.. కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): 'మూలకు మురిపెంగా' అనే శీర్షిక న గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి రాష్ట్ర టీఎస్ఎంఎస్ఐడీసీ అధికారులు స్పందించారు. పరిశీలించి నివేదిక ఇవ్వాలని జిల్లాలోని టీఎస్ ఎంఎస్ఐడీసీ ఏఈ శరత్‌ను ఆదేశించడంతో ఈ మేరకు ఆయన జనరల్ ఆసుపత్రిలో మూలకు పడ్డ వైద్య పరికరాలు, యంత్రాలను పరిశీలించారు. వెంటిలేటర్లు, పిపాప్‌లు, ఎక్స్‌రే, స్కానింగ్ మిషన్లు, మానిటర్లకు ఏ సమస్యలు ఉన్నాయి... వాటి మరమ్మతులకు అయ్యే ఖర్చుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్‌సింగ్ అన్ని వైద్యపరికరాల పనితీరు, మరమ్మతులకు అయ్యే ఖర్చుల వివరాలను ఏఈకి వివరించారు. ఇక్కడి పరిస్థితులపై నివేదిక తయారు చేసి రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపిస్తామని ఏఈ తెలిపారు.



వైద్యపరికరాలను పరిశీలిస్తున్న అధికారులు

మత్తులో మర్డర్లు!



- రెండ్రోజుల్లో రెండు హత్యలు.. ఓ హత్యాయత్నం!
- జడ్చర్ల, భూత్పూర్, మహబూబ్‌నగర్‌లలో ఘటనలు
- గంజాయి, మద్యం మత్తే నేరాలకు కారణమా ?



భగీరథకాలనీలో హత్యాయత్నానికి గురైన వ్యక్తి (ఫైల్)

మత్తులో మర్డర్లు షరా మామూలయ్యాయి. ఈ మధ్య కాలంలో చిన్నపాటి ఘర్షణలు.. మాటలతో చోటుచేసుకునే వాదనలే హత్యలకు దారితీస్తున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో రెండు రోజుల వ్యవధిలోనే రెండు హత్యలు, ఒక హత్యాయత్నం చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో జిల్లా ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. దీనికంతటికీ గంజాయి, మద్యం మత్తుతో ఎవరు ఏం చేస్తున్నామన్న సోయి లేకుండా ప్రవర్తిస్తున్నారు. ఇందుకు కారణాలూ లేకపోలేదు. సంబంధిత పోలీసు అధికారులైనా ఇలాంటి ఘటనలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పాలమూరు జిల్లాలో హత్యలు.. హత్యాయత్నాలు పెరుగుతున్నాయి. చిన్నచిన్న విషయాలే హత్యలకు దారితీస్తున్నాయి. జిల్లాలో రెండ్రోజుల వ్యవధిలో రెండు హత్యలు జరగగా మరో హత్యాయత్నం చోటుచేసుకోవడం కలకలం రేపుతోంది. గంజాయి, మద్యం మత్తులోనే ఎక్కువగా నేరాలు జరుగుతున్నాయి. పెట్రోలింగ్ బృందాలు ఇసుక అక్రమ రవాణా, అనుమతులకు విరుద్ధంగా తరలించే స్టీల్, ఎర్రమన్ను, డీజిల్, బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగటం వంటి వాటిపైనే ఎక్కువగా దృష్టి సారిస్తున్నారన్న ఫిర్యాదులున్నాయి.

ఈ నెల 25న జడ్చర్లలో బిహార్‌కు చెందిన రషీద్‌ఖాన్ హత్యకు గురయ్యాడు. పరిశ్రమలో కూలీ పనిచేసే రషీద్‌ఖాన్ తోటి కూలీలతో కలిసి బీఆర్‌రెడ్డి ఫంక్షన్‌హాల్ గదిలో అద్దెకు ఉంటున్నాడు. అదే గదిలో బాత్‌రూమ్‌లో హత్యకు గురయ్యాడు. ఆ మరుసటి రోజే భూత్పూర్ మండల కేంద్రం మునిరంగస్వామి దేవాలయ ప్రాంగణంలో మొల్గరకు చెందిన రంగమ్మ దారుణహత్యకు గురైంది. బండరాళ్లతో తలపై మోది హత్య చేశారు. అదేరోజు మహబూబ్‌నగర్‌లో హత్యాయత్నం జరిగింది. నగరంలోని భగీరథకాలనీ కమాన్ దగ్గర నిలబడి ఉన్న వ్యక్తిని ఓ బాలుడు సంబంధం లేకుండా వచ్చి కత్తితో నాలుగు కత్తిపోట్లు వేశాడు. ఎందుకు దాడి చేశాడో కూడా ఇప్పటివరకు పోలీసులు ఛేదించలేదు. ఇతను ప్రాణాపాయ పరిస్థితుల్లో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. ఇలా అకారణంగా చేస్తున్న దాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. గంజాయికి అలవాటు పడి మత్తులో కొందరు ఏం చేస్తున్నారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

గతనెల 23న ఏనుగొండలోని ఓ బార్ వద్ద ఉన్న వ్యక్తిపై కొందరు వ్యక్తులు అకారణంగా దాడి చేశారు. పిడిగుద్దులు గుద్ది, ఆయుధాలతో దాడి చేసి పరారయ్యారు. కొద్దిరోజుల క్రితం భగీరథకాలనీ వైన్స్ దగ్గర కూడా మద్యం తాగిన వ్యక్తులు గొడవ పడి కత్తులతో దాడి చేసుకున్నారు.

ఫిబ్రవరి మొదటి వారంలో నగరంలో ముగ్గురు స్నేహితులు మద్యం తాగారు. అనంతరం వారి మధ్య గొడవ జరగగా కత్తులతో దాడి చేసుకున్నారు. విషయం పోలీసులకు తెలియడంతో కేసు నమోదు చేశారు. ఇలా జిల్లాలో గంజాయి, మద్యం కారణంగా ఎక్కువగా నేరాలు జరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. పోలీసులు పెట్రోలింగ్ పెంచాల్సిన అవసరం ఉంది. రాత్రివేళ కొందరు యువకులు బైపాస్, రాయిచూరు-హైదరాబాద్ ప్రధాన రహదారిపై బైక్ రేసింగ్‌లకు పాల్పడుతున్నారు.

విపరీతంగా సౌండ్ చేస్తూ బైక్‌లపై కట్‌లు కొడుతూ, బీటీపై సైడ్‌స్టాండ్‌లను రాస్తూ నిప్పులు రాజేస్తూ స్టంట్‌లు చేస్తూ రహదారిపై వెళ్లే తోటి ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నారు. ఇలాంటి వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

రూ.720 కోట్లతో అభివృద్ధి పనులు

- 2న శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



సమావేశంలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే మేఘారెడ్డితో కలిసి మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

వనపర్తిఅర్బన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వనపర్తి నియోజకవర్గంలో రూ.721 కోట్ల అభివృద్ధి పనులకు వచ్చే నెల 2వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపనలు చేయనున్నారని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డితో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వనపర్తి ప్రజలపై ఉన్న ప్రేమతో నియోజకవర్గంలో రూ.721 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఒకేసారి రూ.721 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభించడం ఇదే మొదటిసారి అన్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ... సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత రేవంత్‌రెడ్డి చదువుకున్న ఊరికి తొలిసారి రానున్నారని తెలిపారు. 14 నెలల కాలంలో వనపర్తిలో రూ.397 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు సహకారం అందించారన్నారు. మార్చి 2వ తేదీన రూ.721 కోట్లకు సంబంధించి శంకుస్థాపన చేయబోతున్నారని తెలిపారు. ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ... సీఎం వనపర్తిలో చదువుకున్న నేప థ్యంలో ఆయనకు ఈ ప్రాంతంతో మంచి అనుబంధం ఉన్న కారణంగా వనపర్తి అసెంబ్లీ అభివృద్ధి కోసం రూ.721 కోట్లతో శంకుస్థాపనలు చేయబోతున్నారన్నారు. సీఎం రేవంత్ ఆయనతో చదువుకున్న వారందరితో ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొననున్నారన్నారు. ఆయన ఇక్కడ ఉన్నప్పుడు పార్వతమ్మ అనే వారి ఇంట్లో ఉండి చదువుకున్నారని, వారి ఇంటికి కూడా సీఎం రాబోతున్నారన్నారు. సమావేశంలో మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, మునిసిపల్ మాజీ చైర్మన్ పుట్టపాకల మహేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు శంకర్ ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్ తదితరులు పాల్గొన్నారు.

రథోత్సవం రమణీయం

- వైభవంగా నిడుగుర్తి శంకరలింగేశ్వర స్వామి ఉత్సవాలు



నిడుగుర్తిలో రథాన్ని లాగుతున్న భక్తులు

ఊట్కూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని నిడుగుర్తి గ్రామంలోని గుట్టపై వెలసిన శంకరలింగేశ్వర స్వామి రథోత్సవం గురువారం సాయంత్రం వందలాది భక్తుల నడుమ అత్యంత వైభవంగా జరిగింది. తేరు ప్రాంగణంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారి రథాన్ని శివనామస్మరణ చేస్తూ ముందుకు నడిపించారు.

రథానికి ముందు గ్రామంలోని మహిళలు హారతులతో ముందుకు నడిపించారు. ఉదయం గ్రామంలోని భక్తులంతా పిండి వంటకాలు చేసి దాసంగాలతో ఆలయానికి వెళ్లి పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం రాత్రి ఆలయంలో అఖండ భజన కార్యక్రమం నిర్వహించారు. పూజారి బస్వరాజప్ప, మాజీ ఎంపీటీసీ వీరరాఘవరెడ్డి, కృష్ణార్జున్‌రెడ్డి ఆలయ ధర్మకర్త పారిజాతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వేగంగా వసూలు

- 80 శాతం పన్నుల రికవరీ



పెద్దాయపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్ర్యజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలోని 423 గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూలు కార్యక్రమం వేగవంతంగా కొనసాగుతున్నది. ఈ ఏడాది గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో పంచాయతీ కార్యదర్శులు పన్నుల వసూలుపై పెద్దగా దృష్టి పెట్టలేదని చెప్పవచ్చు.

బీసీ కులగణన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. దీంతో గురువారం నాటికి గ్రామ పంచాయతీల్లో పన్నులు 80శాతం వసూలు అయినట్లుగా ఆన్‌లైన్‌లో వివరాలు గ్రామాల వారిగా నమోదు అయ్యాయి. నేటి సాయంత్రం వరకు పన్నుల వసూలు శాతం పెరిగే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో మొత్తం పన్నుల డిమాండ్ 7,10,74,604 ఉండగా నేటికీ 5,66,21,243 వసూలు అయ్యాయి. ఇంకా రావాల్సిన బకాయిలు 1,44,53, 361 ఉండగా వాటిలో నేటి సాయంత్రం వరకు మరో 5శాతం పన్నులు వసూలయ్యేలా ఉన్నాయి. వాటి వివరాలు సా యంత్రంలోగా ఆ న్‌లైన్‌లో నమోదు అవు తాయి. అత్యధికంగా మహబూబ్‌నగర్ మండలంలో 93 శాతం, హన్వాడ మండలంలో 92శాతం పన్నులు పంచాయతీ కార్యదర్శులు సేకరించారు. అత్యల్పంగా జడ్చర్ల మండలంలో 56 శాతం మాత్రమే వసూలు అయ్యాయి.

● మార్చి రెండో వారంలోగా 100శాతం వసూలు చేస్తాం

గ్రామ పంచాయతీ ఎ న్నికల నిర్వహణ, ప్రభు త్వ సర్వేలతో బి జీగా ఉన్న పంచాయతీ కార్యదర్శులకు ఎన్నికల నిర్వహణ బీసీ కులగనణ తర్వతే నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవ డంతో పన్నుల వసూళ్లపై దృష్టి సారించారు. అత్యధికంగా మహబూబ్‌నగర్ మండలంలో 93శాతం, హన్వాడ మండలంలో 92 శాతం పన్నులు వసూలు అయ్యాయి. పన్నుల వసూళ్లలో వెనకబడ్డ మండలాల్లో దృష్టి సారిస్తాం. మార్చి రెండో వారంలోగా 100 శాతం పన్నులు వసూలు చేస్తాం.

- పార్థసారథి, డీపీవో, మహబూబ్‌నగర్

● ఎన్నికలు ఆలస్యం కావడంతోనే వేగం

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు నేడో రేపో నోటిఫికేషన్ వెలువడుతున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్, పంచాయతీరాజ్ కమిషనరేట్ నుంచి రోజూ ఆదేశాలు వస్తుండటంతో ఆధికారులు తమ దృష్టినంతా దానిపైనే పెట్టారు. ఓటరు జాబితా తయారుతో పాటు, ప్రదర్శన, బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్, ఎన్నికల సామగ్రి మండలాలకు పంపిణీ తదితర పనుల్లో నిమగ్నమయ్యారు. తీరా ఎన్నికల నిర్వహణ ఆలస్యం కావడంతో అధికారులు పన్నుల వసూలుపై దృష్టి సారించారు. దీంతో గత నెలలో 33శాతం వసూలు అయిన పన్నులు నేడు 80శాతానికి చేరుకున్నాయి.

పోక్సో కేసులో దోషికి ఇరవై ఏళ్ల జైలు శిక్ష

- ఎస్పీ యోగేష్ గౌతమ్

6

రంజాన్‌కు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేటటౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమవుతున్న నేపథ్యంలో సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ఛాంబర్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎలాంటి ఇబ్బందులు, లోటుపాట్లకు తావు లేకుండా జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా సమన్వయంతో పని చేయాలని అధికారులకు సూచించారు. ప్రధానంగా తాగునీరు, పారిశుధ్యం వంటి సమస్యలు తలెత్తకుండా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి బాధ్యతలను పురమాయిస్తూ నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, వీధి లైట్ల మరమ్మతులు జరిపించాలన్నారు. అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ఈద్గాల వద్ద పారిశుధ్య సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడా కూడా శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. అనదపు కలెక్టర్(రెవెన్యూ)బెంషాలం, డీఎస్పీ లింగయ్య, ఆర్డీవో రాంచందర్, మైనార్టీ అధికారి ఎం.ఎ.రషీద్, డీఆర్డీవో మొగులప్ప, విద్యుత్ శాఖ డీఈ జితేందర్‌నాథ్, మునిసిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ అంబులెన్స్ ఆకస్మిక తనిఖీ



వెటర్నరీ అంబులెన్స్‌లో పరికరాలను పరిశీలిస్తున్న ఈఎంఆర్ఐ అధికారి భాగేష్‌మిశ్రా

నారాయణపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మక్తల్, నారాయణపేట జీవీకే ఈఎంఆర్ఐ 1962 మొబైల్ వెటర్నరీ అంబులెన్స్‌లను గురువారం ప్రాజెక్టు హెడ్ డాక్టర్ భాగేష్‌మిశ్రా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్‌లో పరికరాలు, వాటి పనితీరు, రికార్డులు, సిబ్బంది పనితీరును ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కాల్ వచ్చిన వెంటనే 1962 సిబ్బంది తక్షణమే స్పందించి సేవలు అందిస్తున్నారన్నారు. జిల్లాలో ప్రతీ అంబులెన్స్ పది ట్రిప్పులు, అలాగే 20కి పైగా పశువులకు వైద్యసేవలు అందిస్తున్నాయన్నారు. పశువుల వైద్య సహాయం కోసం 1962కు సమాచారం అందిస్తే మొబైల్ వెటర్నరీ సిబ్బంది మీ వద్దకు వచ్చి పశువులకు చికిత్సలు చేసి, మందులు అందిస్తారన్నారు.

జిల్లాలోని రైతులు 1962 సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ మేనేజర్ రవి, ఎగ్జిక్యూటివ్ రాఘవేందర్, డాక్టర్ వైష్ణవి, మురళి, చంద్రశేఖర్, వెంకట్‌నారాయణ, శివ, అశోక్, మహబూబ్ తదితరులున్నారు.

కొత్త టీచర్లకు శిక్షణ

● నేటి నుంచి ప్రారంభం

- జిల్లాలో 246 మంది ఉపాధ్యాయులు

నారాయణపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఆదర్శవంతులుగా తీర్చిదిద్దేందుకు కొత్తగా విధుల్లోకి చేరిన టీచర్లకు శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు నారాయణపేట జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి కొత్త టీచర్లకు శిక్షణ అందించనున్నారు. ఈ నెల 28 నుంచి మార్చి 1 వరకు, మార్చి 1 నుంచి 3వ తేదీ వరకు నారాయణపేట కస్తూర్బాలో శిక్షణ కొనసాగనుంది.

ఐదు సెక్షన్లుగా ఉదయం తొమ్మిదిన్నర నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు శిక్షణ ఇస్తారు. ఎస్‌జీటీ తెలుగు, ఉర్దూ, కన్నడ మీడియం వారికి పేట కేజీబీవీలో శిక్షణ ఇస్తారు. ఎస్‌ఏ తెలుగు, ఎల్‌పీ తెలుగు, ఎస్‌ఏ హిందీ, ఎల్‌పీ హిందీ, ఎస్‌ఏ ఇంగ్లీష్, ఎస్‌ఏ గణితం, ఎస్‌ఏ బయోసైన్స్, ఎస్‌ఏ సోషల్ వారికి మార్చి 4 నుంచి 6 వరకు మహబూబ్‌నగర్‌లో, ఎస్‌ఏ స్పెషల్ ఉర్దూ, ఎస్‌జీటీ స్పెషల్ ఉర్దూ వారికి మార్చి 10 నుంచి 12 వరకు మహబూబ్‌నగర్‌లో, ఎస్‌ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ పీఈటీలకు మార్చి 4 నుంచి 6 వరకు మహబూబ్‌నగర్‌లో, ఎస్‌ఏ, ఎల్‌పీ ఉర్దూ, ఎస్‌ఏ ఫిజికల్ సైన్స్ వారికి ఫిబ్రవరి 28 నుంచి మార్చి 1 వరకు టీజీఐఆర్‌డీ రాజేంద్రనగర్ హైదరాబాద్‌లో శిక్షణ ఇవ్వనున్నారు.

జిల్లాలో కొత్త టీచర్లు ఇలా...

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో డీఎస్సీ-2024 జిల్లాలో ఎంపికైన కొత్త టీచర్ల విషయానికి వస్తే... ఎస్‌ఏ తెలుగు -5 మంది, ఎస్‌ఏ హిందీ-1, ఎస్‌ఏ ఇంగ్లీష్-12, ఎస్‌ఏ ఉర్దూ-1, ఎస్‌ఏ ఫిజిక్స్ సైన్స్, తెలుగు మీడియం-6, ఎస్‌ఏ మ్యాథ్స్ తెలుగు మీడియం-9, ఎస్‌ఏ మ్యాథ్స్ కన్నడ మీడియం-1, ఎస్‌ఏ బయోసైన్స్ తెలుగు మీడియం-15, ఎస్‌ఏ బయోసైన్స్ ఉర్దూమీడియం-1. ఎస్‌ఏ సోషల్, తెలుగు మీడియం-17, ఎస్‌ఏ సోషల్, ఉర్దూ మీడియం-1, ఎస్‌ఏ పీడీ-1, ఎస్‌ఏ స్పెషల్ ఎడ్యుకేషన్-5, ఎస్‌జీటీ తెలుగు మీడియం-133 మంది, ఎస్‌జీటీ ఉర్దూ మీడియం-3, ఎస్‌జీటీ కన్నడ మీడియం-3, ఎల్‌పీ తెలుగు మీడియం-11, ఎల్‌పీ హిందీ-4, ఎల్‌పీ ఉర్దూ-3, ఎల్‌పీ కన్నడ-1, పీఈటీ-1తో కలిపి మొత్తం 234 మంది ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎస్‌జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ ద్వారా 12 మంది మొత్తం కలిపి 246 మంది ఉపాధ్యాయులు జిల్లాలో ఉన్నారు. అయితే ఇందులో నారాయణపేట కస్తూర్బాలో ఎస్‌జీటీలు 137 మంది, 2008 డీఎస్సీ వారు 44 మందికి శిక్షణ ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. టీఏ, డీఏల కోసం జిల్లాకు రూ.1,69,050 నిధులు కేటాయించగా, ఇందులో 50 శాతం నిధులు మంజూరయ్యాయి. శిక్షణ అనంతరం మిగతా 50 శాతం నిధులు మంజూరు కానున్నాయి.



పేట మండలంలో కొత్త టీచర్లకు అపాయిట్మెంట్ ఆర్డర్ అందిస్తున్న ఏంఈఓ బాలాజీ (ఫైల్)

శిక్షణ సమయంలో సెలవులు ఇవ్వొద్దు

శిక్షణ సమయంలో ఉపాధ్యాయులకు ఎలాంటి సెలవులు ఇవ్వరాదని రాష్ట్ర విద్యాశాఖ జిల్లా డీఈవో గోవిందురాజులును ఆదేశించింది. పాఠ్యపుస్తకాలు సంపూర్ణంగా ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై కొత్త టీచర్లకు సవివరంగా అవగాహన కల్పించనున్నారు. విద్యార్థులను ఆకర్షించే విధంగా తరగతి గదిని ఎలా తీర్చిదిద్దాలి, విద్యాసామర్థ్యాలు, అభ్యసన ఫలితాలకు సంబంధించి పిల్లలను ఎలా డెవలప్ చేయాలనే దానిపై డీపీఆర్‌పీ బోధన రూపంలో శిక్షణ ఇస్తారు. బోధన, వార్షిక ప్రణాళిక తయారీ, ఎఫ్‌ఏ-1, ఎస్‌ఏ పరీక్షల నిర్వహణ, పాఠ్యపుస్తకాల్లోని పాఠాలు బోధించే క్రమంలో యాక్టివిటీస్‌ను రూపొందించుకునే విధానం తదితర అంశాలను నేర్పిస్తారు. ఆన్‌లైన్‌లో ఉన్న అంశాలను ఉపయోగించుకొని విద్యార్థులకు బోధించే మెటీరియల్‌ను ఎలా తయారు చేసుకోవాలనే దానిపై ప్రత్యక్షంగా చేసి చూపిస్తారు. మూల్యాంకన పద్ధతులు, విద్యాశాఖ నిర్వహించే కార్యక్రమాలపై శిక్షణలో సవివరంగా వివరిస్తారు.

నూతన విద్యావిధానం

రాష్ట్రంలో అమలు చేయొద్దు

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.కిరణ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.కిరణ్

నారాయణపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యావిధానం రాష్ట్రంలో అమలు చేయొద్దని, ఈ విషయమై వచ్చే అసెంబ్లీ సమావేశంలో తీర్మానం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.కిరణ్ డిమాండ్ చేశారు. గురువారం నారాయణపేట స్ఫూర్తి కాలేజీలోని సీతారాం ఏచూరి ప్రాంగణంలో జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా మూడవ మహాసభలకు డి.కిరణ్ హాజరై, మాట్లాడారు. నూతన జాతీయ విద్యావిధానం తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయొద్దని కోరారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, మెస్, కాస్మోటిక్స్ చార్జీలను పెంచాలన్నారు. కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఫీజులను నియంత్రించాలన్నారు. జిల్లాలో ఆశ్రమ, గురుకులాలు, ఏకలవ్య, మోడల్ రెసిడెన్షియల్స్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేస్తున్నామన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి భావాలు పెంపొందించడానికి జాతీయ నాయకుల జయంతులు, వర్ధంతులు, సమాజం పట్ల అవగాహన కల్పించేందుకు పలు అంశాలపై సెమినార్లు, చర్చాగోష్ఠులు, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరహరి, మహేందర్, నరసింహ, కాశీ, నయూమ్, రమేష్ శ్రావణి, కవిత, భానుప్రసాద్, పవన్‌కుమార్, అశోక్ తదితరులున్నారు.

పోక్సో కేసులో దోషికి

20 ఏళ్ల జైలు శిక్ష

- ఎస్పీ యోగేష్ గౌతమ్



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేటటౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కోర్టులో పోక్సో కేసు దోషిగా ఉన్న నరేష్‌పై నేరం నిరూపణ కావడంతో జిల్లా ప్రధాన న్యాయాధికారి మహమ్మద్ అబ్దుల్ రఫీ 20 సంవత్సరాలు జైలు శిక్షతో పాటు రూ. 50వేల జరిమానా విధించారు. అలాగే, బాధితురాలికి పరిహారంగా రూ.5 లక్షలు ఇవ్వాల్సిందిగా తీర్పు వెలువడినట్లు ఎస్పీ యోగేష్ గౌతం తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను గురువారం విలేకరులకు ఎస్పీ వెల్లడించారు. దామరగిద్ద మండలానికి చెందిన బాలికను బండగొండ నరేష్ (26) వృత్తి ఆటో డ్రైవర్. దామరగిద్ద మండలం పిడెంపల్లి గ్రామానికి చెందిన ఈ వ్యక్తికి ముందే పెళ్లి అయింది. అయినా ఇంటర్ చదువుతున్న విద్యార్థిని నిన్ను ప్రేమిస్తున్నానని వెంట పడి వేధిస్తుంటే తండ్రితో తెలుపుగా ఆ కుటుంబ సభ్యులందరు అతన్ని మందలించారు. ఆ తర్వాత నారాయ ణపేట జిల్లాలోని బంధువుల దగ్గర ఉంచారు. అయితే, 2021 మార్చి 19న మాయ మాటలు చెప్పి ఎత్తుకెళ్లి ముంబయిలో శారీరకంగా అనుభవించిన నరేష్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసు కోవాలని బాధితురాలి తండ్రి అదే నెల 30న నారాయణపేట ఠాణాలో ఎస్ఐ చంద్రమోహ న్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ శ్రీకాంత్‌రెడ్డి కేసు విచారణ చేసి కోర్టులో చార్జీషీట్ నమోదు చేశారు. ప్రస్తుత సీఐ శివశంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఏఎస్ఐ కృష్ణయ్యగౌడ్, కోర్టు పీసీ విజయ్‌కుమార్, హోమ్‌గార్డు మీర్జాబేగ్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆకుల బాలప్ప కోర్టులో వాదనలు వినిపించగా నేరస్థునిపై నేరం నిరూపణ కావడంతో 2025 ఫిబ్రవరి 27న జిల్లా ప్రధాన న్యాయాధికారి అతడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 50వేల జరిమానా, బాధితురాలికి రూ. 5లక్షల పరిహారం ఇవ్వాల్సిందిగా తీర్పు ఇచ్చారని ఎస్పీ తెలిపారు. ఈ కేసులో బాగా పని చేసిన పోలీస్ అధికారులను, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను కోర్టు డ్యూటీ అధికారులను ఎస్పీ అభినందించారు. త్వరలో రివార్డు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నారాయణపేట జిల్లా పరిధిలో ఎవరైనా మహిళలను, అమ్మాయిలను వేధించినా, హింసించినా చట్టప్రకారం శిక్షించబడుతారని హెచ్చరించారు.

5 నుంచి

ఇంటర్మీడియట్ పరీక్షలు

● ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

● 36 పరీక్ష కేంద్రాలు, హాజరుకానున్న 22,483 మంది విద్యార్థులు

● పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



సమావేశలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్ నగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మార్చి5 నుంచి 25 వరకు జరుగనున్న ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. అంతేకాకుండా తప్పులకు ఎలాంటి ఆస్కారం ఇవ్వవద్దని సూచించారు. గురువారం ఆమె కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఇంటర్మీడి యట్ పరీక్షల నిర్వహణ విషయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఇంటర్ మొదటి, రెండో సంవంత్సరం విద్యార్థిని, విద్యార్థులు (ఒకేషనల్ కోర్స్ విద్యార్థులతో సహా) 22,483 మంది హాజరు కానున్నారని సంబంధిత ఇంటర్మీడియట్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. పరీక్షల నిర్వహణకు 36 కేంద్రాలను ఏర్పాటు చేసిన ట్లు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 14, తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ జూనియర్ కళా శాలలో 1, తెలంగాణ మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాలో 2, ఉన్నత పాఠశాలలో 6, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో 13 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 9 గం టల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలను నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణపై ఆయా శాఖల అధికారులకు పలు సూచనలుచేస్తూ ఆదేశా లు జారీ చేశారు. ప్రతీ కేంద్రంలో కావలసిన మం దులతో పాటు ఫస్ట్ ఎయిడ్, ఏఎన్ఎంలను ఏర్పాటు చేయాలని ఆ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించా రు. సీసీ కెమెరాల మధ్య పరీక్షలనిర్వహణ జరుగు తుందని అందుకు మార్చి 5 నుంచి 25 వరకు ఎలాంటి విద్యుత్ అంతరాయం కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూ చించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, అదనపు ఎస్పీ రాములు, ఆర్డీవో నవీన్, నగర కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, డీపీవో పార్థసారధి, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిణి కౌసర్ జహాన్, డిప్యూ టీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ శశికాంత్, విద్యుత్, ఆర్ టీసీ, సమాచార, పోస్టల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

జూరాల ప్రాజెక్టుకు 365 క్యూసెక్కుల వదర



జూరాల ప్రాజెక్టు

అమరచింత, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : జూరాల ప్రాజెక్టుకు కర్ణాటక ప్రభుత్వం వదిలిన నీరు గురువారం తగ్గుముఖం పట్టింది. నారాయణపూర్ డ్యాం నుంచి కర్ణాటక ప్రభుత్వం కేవలం ఒక్క టీఎంసీ నీటిని మాత్రమే వదిలి బుధవారం నిలిపివేసినట్లు తెలిసింది. మూడో రోజు గురువారం ప్రాజెక్టుకు కేవలం 365 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే వచ్చింది. మంత్రి జూపల్లి ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు కర్ణాటక ముఖ్యమంత్రితో జరిపిన చర్చల్లో కర్ణాటక ప్రభుత్వం నాలుగు టీఎంసీల నీటిని దిగువకు వదులుతామని హామీ ఇచ్చింది. ఇందులో భాగంగా ఒక్క టీఎంసీని మాత్రమే వదిలారు. మొత్తం ఇప్పటికి కర్ణాటక నుంచి 5,583 క్యూసెక్కుల నీరు చేరింది. వారబందీ రూపంలో యాసంగి పంట కోసం ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ నుంచి 550 క్యూసెక్కులు, కుడి కాలువ నుంచి 375 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కోయిల్ సాగర్ లిఫ్ట్‌కు 220, భీమా లిఫ్టుకు 650, నెట్టెంపాడు లిఫ్టునకు 625 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టు నుంచి 2,495 క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తోంది. కర్ణాటక ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మరో మూడు టీఎంసీల నీటిని వదిలితే సాగు, తాగునీటికి ఎలాంటి ఇబ్బంది ఉండదని అధికారులు చెబుతున్నారు.

అర్హులందరికీ 'ఉపాధి' పని కల్పించాలి

- అడిషనల్ డీఆర్‌డీవో రాజేశ్వరి



తాడూరులో ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీలో మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీవో రాజేశ్వరి

తాడూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిరుపేద కూలీల కోసం అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని అడిషనల్ డీఆర్‌డీవో రాజేశ్వరి తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి 2023-24సంవత్సరంలో చేపట్టిన పనులను సామాజిక తనిఖీ సిబ్బంది విచారణ చేపట్టారు. దీంతో మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలో 2023-24సంవత్సరానికి సంబంధించి 14వ సామాజిక తనిఖీ బృందం చేపట్టిన విచారణ ప్రకారం 4కోట్ల 60లక్షల రూపాయలు కూలీలకు ఖర్చు చేశారు. ఇందులో జరిగిన తప్పులకుగాను రూ.16వేలు రికవరీ చేయగా రూ.30వేలను పెనాల్టీగా విధించినట్లు తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది చేపట్టే పనుల్లో ఎక్కడా అవకతవకలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, ఏపీవో చంద్రసిద్దార్థ, పంచాయతీ కార్యదర్శులు ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో

శివపార్వతుల కల్యాణం



సోమశిల లలితాంబిక సోమేశ్వర ఆలయంలో శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న పురోహితులు

కొల్లాపూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి సందర్భంగా కొల్లాపూర్ మండలం సోమశిల లలితాంబిక సోమేశ్వరాలయంలో, కొల్లాపూర్ శివాలయంలో కనుల పండువగా శివపార్వతుల కల్యాణోత్సవం గురువారం ఘనంగా జరిగింది. సోమశిలలోని శ్రీ లలితాంబిక సోమేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బుక్క గోవింద్‌రెడ్డి దంపతులు, ధరణిపతి శ్రీనివాస్‌రావు దంపతులు వేదపండితుల వేద మంత్రోచ్చరనాల మధ్య వైభవోపేతంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అలాగే కొల్లాపూర్ పట్టణంలోని అమరేశ్వరాలయంలో బుధవారం అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో శివపార్వతుల కల్యాణం దేవాదాయ శాఖ సీనియర్ అసిస్టెంట్ జైపాల్‌రెడ్డి దంపతులు నిర్వహించారు. ఈ ఆలయంలో అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో స్వామి వారి కల్యాణం జరగడం ఇక్కడ విశేషం. స్వామి వారి కల్యాణోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు.



సోమశిల లలితాంబిక సోమేశ్వరాలయం నుంచి రథోత్సవం ఊరేగింపు

విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచిన

కౌటిల్య సైన్స్ రచనలు

బిజినేపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : తన సైన్స్ రచనల ద్వారా విద్యార్థుల్లో సైన్స్ అంశాల బోధనపై పఠనాసక్తిని పెంపొందించిన రచయిత ప్రతాప్ కౌటిల్యను తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్లు, ప్రొఫెసర్ డాక్టర్ రాజేందర్ సింగ్, ప్రొఫెసర్ డాక్టర్ యాదగిరిలు కొనియాడారు. హైదరాబాద్‌లోని ఉన్నత విద్యాశాఖ కమిషనరేట్‌లో గురువారం సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని డాక్టర్ ప్రతాప్ కౌటిల్యను శాలువాతో సన్మానించి మాట్లాడారు. బయో కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉంటూనే పరిశోధనల పట్ల అభిరుచితో సైన్స్ డాట్ కమ్, సైన్స్ నేచర్ వంటి పుస్తకాలను రచించి విద్యార్థుల్లో సైన్స్ బోధన పట్ల, సైన్స్ పరిశోధనల పట్ల అభిరుచిని కల్గించారని అన్నారు. ప్రతాప్ కౌటిల్య రాసిన పుస్తకాలు సైన్స్‌ను సృజనాత్మకంగా బోధిస్తే వినూత్నమైన ఆవిష్కరణల దిశగా ఆలోచనలు విద్యార్థుల్లో రేకెత్తిస్తున్నాయన్నారు. సైన్స్‌లో మరిన్ని పుస్తకాలు రచించి రాబోయే భవిష్యత్ తరాల వారికి నూతన ఆవిష్కరణ చేసేలా ఉపయోగపడాలని తెలిపారు.



సైన్స్‌పై పరిశోధనాత్మక పుస్తకాలు రాసిన రచయిత డాక్టర్ ప్రతాప్ కౌటిల్యను సన్మానిస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్లు డాక్టర్ రాజేందర్ సింగ్, డాక్టర్ యాదగిరి

నేడు సింగోటానికి ఎమ్మెల్సీ కవిత రాక



కొల్లాపూర్/ పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి):కొల్లాపూర్ మండలం సింగోటం గ్రామానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేడు రానున్నట్లు బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుంద్రెడ్డి నరేందర్‌రెడ్డి తెలిపారు. సింగోటం గ్రామంలో లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డితో కలిసి కవిత ప్రత్యేక పూజలు చేస్తారని ఆయన పేర్కొన్నారు. నేడు ఉదయం 10 గంటలకు సింగోటం గ్రామానికి కవిత వస్తారని, నియోజక వర్గంలోని బీఆర్ఎస్ నాయకులు ఆమెకు ఘనంగా స్వాగ తం పలకనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అక్కడి నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించే బీసీ రౌండ్ టేబుల్ సమావేశానికి ఆమె హాజరు కానున్నట్లు తెలిపారు. ఇదే విషయమై కొల్లాపూర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుజ్జుల పరమేశ్, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవినాయక్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని మండల సీనియర్ నాయకులు, అన్ని గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షన్న అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మల్టీజోన్-2లో మొదటి స్థానంలో

గద్వాల జిల్లా షీ టీం : ఎస్పీ

గద్వాల క్రైం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మహిళలు, యువతులు, బాలికలపై జరిగే లైంగిక వేధింపులకు అడ్డుకట్ట వేసేందుకు పని చేస్తున్న జోగుళాంబ గద్వాల జిల్లా షీ టీం 'మల్టీజోన్-2'లోని 13 జిల్లాలలో మొదటిస్థానంలో నిలిచిందని ఎస్పీ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్‌శాఖ మహిళల భద్రతకు తొలిప్రాధాన్యతను ఇస్తుందన్నారు. మహిళలకు వారి హక్కులు, చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అలాగే ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే షీ టీం తగు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లాలో షీటీం బృందం జనవరి నెలలో 14 ఫిర్యాదులు స్వీకరించి ఈవ్‌టీజింగ్‌కు పాల్పడిన 13 మందిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని ఒక ఎఫ్ఐఆర్ కేసు, 13 పెట్టికేసులు నమోదు చేయించారని తెలిపారు. జిల్లాలో గుర్తించిన హాట్‌స్పాట్‌ను తరుచు సందర్శించడం ద్వారా 'మల్టీజోన్-2'లోని 13 జిల్లాలో జోగుళాంబ గద్వాల షీ టీం మొదటిస్థానంలో నిలవడం అభినందనీయం అన్నారు. జిల్లాలో మహిళలు వేధింపులకు గురైన వెంటనే షీ టీం ను ఆశ్రయిస్తే సత్వర న్యాయం జరుగుతుందని ఎస్పీ సూచించారు. జిల్లాలో ఎవరైనా వేధింపులకు గురైతే వెంటనే 8712670132కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

రేపు సిర్సనగండ్ల

దేవాలయంలో వేలం పాట

- ఆలయ చైర్మన్ డేరం రామశర్మ

చారకొండ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిర్సనగండ్ల గ్రామ పంచాయతీలోని అయోధ్యనగర్ (గుట్ట)లో అపర భద్రాద్రిగా కొలువు దీరిన సీతారామచంద్రస్వామి దేవస్థానంలో వచ్చే ఏప్రిల్‌లో జరిగే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా కొబ్బరికాయలు, కొబ్బరి ముక్కలు, తలనీలాలలు, లడ్డూ, పులిహోర ప్రసాదాలకు మార్చి 1న స్వామి వారి కల్యాణ మండపంలో మధ్యాహ్నం 2 గంటలకు దేవాదాయ, ధర్మాదాయశాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ డేరం రామశర్మ, ఈవో స్వర్గం ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు కొబ్బరికాయలకు రూ. 5 లక్షలు, తలనీలాలకు రూ. లక్ష, కొబ్బరి చిప్పలకు రూ. 50వేలు, లడ్డూ, పులిహోర ప్రసాదాలకు రూ2 లక్షలు చొప్పు న డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు తమ చిరునామా, ఆధార్‌కార్డు తెచ్చుకోవాలని అన్నారు. పాట పూర్తి కాగానే 75 శాతం డబ్బులు చెల్లించాలని, మిగతా డబ్బులు రెండురోజుల్లో చెల్లించాలని అన్నారు. ఆసక్తిగలవారు వేలం పాటలో పాల్గొనాలని వారు తెలిపారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆధార్ కార్డు అన్ని సేవలకు కీలకంగా మారిందని, ప్రతీ ఒక్కరు వివరాలు, బయోమెట్రిక్‌ను నవీకరించుకోవాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లాస్థాయి ఆధార్ మానిట రింగ్ కమిటీ సమావేశం జరిగింది. మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు వెబ్‌ఎక్స్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు పౌర సేవలు పొందాలంటే ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి అన్నారు. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్డు వివరాలు పునరుద్ధరించుకోవాలని పేర్కొన్నారు. పుట్టిన శిశువు మొదలుకొని ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా తల్లిదండ్రులు ఆధార్ నమోదు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. 5 నుంచి 15ఏళ్లలోపు గల ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించాలని సూచించారు. మెగా క్యాంపులు నిర్వహించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీనివాసులు, యుఐడీఏఐ అసిస్టెంట్ మేనేజర్ సత్యకళ, జిల్లా పంచాయతీ అధికారి సురేష్, ఈడీఎం విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదరణకు నోచని

సైన్స్ మ్యూజియం

» పాడైన పరికరాలు, తుప్పుపట్టిన ఆట వస్తువులు

» టూరిజం శాఖ నుంచి అరకొరగా నిధులు



సైన్స్ మ్యూజియంలోని పరికరాలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల కోసం మహబూబ్‌నగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన మ్యూజియం ఎవరికీ పట్టింపు లేక నిరాదరణకు గురవుతోంది. దీనికి తోడు నిధుల లేమితో నిర్వహణ కష్టంగా మారింది. ఈ మ్యూజియం టూరిజం శాఖ కార్యాలయం ఆవరణలో ఉంది. ఆ శాఖకు వచ్చే ఆదాయంలో పది శాతం నిధులను మ్యూజియానికి కేటాయిస్తున్నారు. ఆ నిధులతోనే కరెంటు బిల్లు, ఇద్దరు కాంట్రాక్ట్ ఉద్యోగులు స్వీపర్, నైట్ వాచ్‌మాన్‌లకు వేతనాలు ఇస్తున్నారు. 2007 నుంచి 2012 మధ్య కాలంలో తెచ్చిన పరికరాలే మ్యూజియంలో ఉన్నాయి. వాటిలో కొన్ని పాడైపోయాయి. పిల్లలకు సంబంధించిన ఆట వస్తువులు తుప్పుపట్టిపోయాయి. జాతీయ సైన్స్ దినోత్సవం రోజు మాత్రం అక్కడున్న శాస్త్రవేత్తల విగ్రహాలు, ఫొటోలకు పూల మాలలు వేసి మమ అనిపిస్తున్నారు. మ్యూజియంలో పూర్తి స్థాయి సిబ్బంది కూడా లేరు. నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట ప్రభుత్వ పాఠశాలలో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేసే ఉద్యోగిని డిప్యుటేషన్‌పై కేటాయించారు. ఆయనతో పాటు ఇద్దరు కాంట్రాక్ట్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. జిల్లాల విభజన జరిగి ఎనిమిదేళ్లు అవుతున్నా అచ్చంపేటకు సంబంధించిన ఉద్యోగి ఇక్కడే పని చేస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

నిధుల కొరతతో ఇక్కట్లు

విజ్ఞానశాస్త్రంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు 2007లో మహబూబ్‌నగర్ పట్టణంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో సైన్స్ మ్యూజియం ఏర్పాటు చేశారు. విద్యార్థులను ఆకట్టుకునేలా సైన్స్ పరికరాలు, జీవ, భౌతిక, రసాయన శాస్త్రాలకు సంబంధించిన ప్రయోగాలు, శాస్త్రవేత్తల చిత్రాలు, వారి వివరాలను అందుబాటులో ఉంచారు. దీంతో ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యార్థులు, సైన్స్ ఉపాధ్యాయులు ఇక్కడికి వచ్చి సందర్శించేవారు. 2012లో డీపీఈపీ నిధుల నుంచి రూ. 20 లక్షలు కేటాయించి పిల్లలమర్రి పక్కన నూతన భవనాన్ని నిర్మించి సైన్స్ మ్యూజియాన్ని అక్కడికి తరలించారు. 2017 వరకు మ్యూజియం నిర్వహణ చక్కగా కొనసాగింది. ఆ తర్వాత నిధుల కొరతతో నిర్వహణ కష్టతరంగా మారింది. నిధులు ఇచ్చేందుకు దాతలు సిద్ధంగా ఉన్నా, వారిని అడిగేవారు లేరన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మ్యూజియాన్ని తిలకించేందుకు వచ్చే విద్యార్థులు, ప్రజలకు కనీస వసతులు కూడా లేవు. మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరాయి. తాగునీటి కోసం ఏర్పాటు చేసిన వాటర్‌ఫిల్టర్ పని చేయడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మ్యూజియం నిర్వహణపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. సీనియర్ సైన్స్ టీచర్‌ను మ్యూజియం అధికారిగా నియమించాల్సి ఉంది. మ్యూజియంలో వసతులపై దృష్టి సారించాలి. విద్యార్థులు, ఉపాధ్యాయులు వచ్చేలా చర్యలు తీసుకోవాలి. సైన్స్ కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ మ్యూజియంపైనా దృష్టి సారించాలి. దాతల సహకారంతో అభి వృద్ధి చేస్తే విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఇంట్లోనే సైన్స్ ల్యాబ్



» ఏర్పాటు చేసిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు టీఎన్ శ్రీధర్

» విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

» జాతీయ స్థాయిలో ఎన్నో పురస్కారాలు - నేడు జాతీయ సైన్స్ దినోత్సవం



విద్యార్థులకు సైన్స్ ప్రయోగాన్ని వివరిస్తున్న ఉపాధ్యాయుడు టీఎన్ శ్రీధర్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే ఆయన లక్ష్యం.. వారికి సైన్స్‌పై సమగ్ర అవగాహన కల్పించడమే ధ్యేయం. అందుకోసం సొంతంగా రూ. 12 లక్షల వ్యయంతో, తన ఇంట్లోనే సైన్స్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. భారత మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం పేరుతో ఏర్పాటు చేసిన ఈ ప్రయోగశాల విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. అంతే కాకుండా విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీస్తూ విజ్ఞాన శాస్త్రంపై అవగాహన కల్పిస్తున్నారు. శాస్త్ర, సాంకేతిక అంశాలను ప్రయోగాత్మకంగా వివరిస్తున్నారు. వారిని జాతీయ, అంతర్జాతీయ సైన్స్ సదస్సులు, కార్యక్రమాల్లో పాల్గొనేలా శిక్షణ ఇస్తున్నారు. భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు శ్రీధర్ విద్యార్థులకు అందిస్తున్న సేవలపై శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

1994లో ఉపాధ్యాయుడిగా నియామకం

మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన టీఎన్ శ్రీధర్ 1994 డీఎస్సీలో ఉపాధ్యాయుడుగా నియమితులయ్యారు. సీసీకుంట మండలం బండ్రవల్లి ప్రాథమిక పాఠశాలలో విధుల్లో చేరారు. అప్పటి నుంచే విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి పెంచేందుకు కృషి చేస్తున్నారు. 2002లో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడుగా పదోన్నతి పొందిన ఆయన అడ్డాకుల మండలంలోని శాఖపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తించారు. 2011లో బదిలీపై నవాబ్‌పేట మండలంలోని యన్మనగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వచ్చారు.

సేవలకు గుర్తింపుగా పురస్కారాలు

ఉపాధ్యాయుడు టీఎన్ శ్రీధర్ విజ్ఞాన శాస్త్ర బోధనలో చేస్తున్న సేవలుకు గుర్తింపుగా పలు పురస్కారాలు అందుకున్నారు. 2018లో ఢిల్లీలో జరిగిన జాతీయ టీచర్స్ సైన్స్ కాంగ్రెస్‌లో పాల్గొని పురస్కారం అందుకున్నారు. 2020లో విజ్ఞాన్ ప్రసార్ కార్యక్రమంలో సైన్స్ పురస్కారాన్ని అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా స్వీకరించారు. 2022లో జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా స్వీకరించారు. అదే ఏడాది అక్టోబరు 15వ తేదీన అబ్దుల్‌కలాం పుట్టిన రోజు సందర్భంగా డ్రీమ్ ఫోర్స్ ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. తన సొంత నిధులు రూ. 12 లక్షలతో ఇంట్లోనే మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం పేరున సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేశారు.

సెలవు రోజుల్లో సందడి

మహబూబ్‌నగర్ పట్టణంలోని సద్దలగుండు ప్రాంతంలో ఉన్న తన ఇంట్లో టీఎన్ శ్రీధర్ ఏర్పాటు చేసిన సైన్‌ల్యాబ్ సెలవు రోజుల్లో విద్యార్థులతో సందడిగా మారుతోంది. ప్రతీ ఆదివారంతో పాటు సెలవు రోజుల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఇక్కడికి వచ్చి సైన్స్ ప్రయోగాలు చేస్తూ, వాటి గురించి తెలుసుకుంటున్నారు. అలాగే ప్రతీ సంవత్సరం జాతీయ సైన్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మండల, జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నారు. ఈ నెలలో 8 మండల స్థాయి, 22 జిల్లా స్థాయి సైన్ టాలెంట్ టెస్టులు నిర్వహించారు. వాటిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సైన్స్ డే రోజున బహుమతులు అందించనున్నారు. అలాగే ప్రతీ ఏడాది వేసవి సెలవుల్లో 12 రోజుల పాటు సైన్స్ శిబిరం నిర్వహిస్తున్నారు. అందుకోసం ఓ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడిగా జనార్దన్, కార్యదర్శిగా పల్లాటి శ్రీకాంత్, సభ్యులు నర్సప్ప, రమాదేవి, చక్రధర్‌గౌడ్, కరుణాకర్‌గౌడ్ ఉన్నారు. సైన్స్ ల్యాబ్ అభివృద్ధికి కమిటీ ఆధ్వర్యంలో నిరంతరం కృషి చేస్తున్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు

టీఎన్ శ్రీధర్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తూనే పలువురు విద్యార్థులను జిల్లా, రాష్ట్ర స్థాయి సైన్స్ పోటీలకు సిద్ధం చేశారు. ఆయన వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారు. విద్యార్థులతో కలిసి 2016లో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీని కలిశారు. అదే సంవత్సరం విద్యార్థిని లక్ష్మి అంతర్జాతీయ స్థాయి సైన్స్ పోటీలకు ఎంపికయ్యింది. జపాన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ శాస్త్రవేత్తల సమావేశంలో పాల్గొని ప్రశంసలు అందుకున్నది.



మైక్రోస్కోప్ పనితీరును పరిశీలిస్తున్న విద్యార్థిని

శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం. వారికి భౌతిక, రసాయన, జీవ శాస్త్రాలకు సంబంధించిన అన్ని విషయాలపై అవగాహన కల్పించేందుకు సొంతంగా ఇంట్లో సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేశాను. శాస్త్ర, సాంకేతిక విషయాలను తెలుసుకునేందుకు విద్యార్థులను ఇస్రో, నేషనల్ సైన్స్ ల్యాబరేటరీ, డీఆర్‌డీవోలకు పంపించాను. సైన్స్ పాఠ్యాంశాలను ప్రయోగాత్మకంగా బోధిస్తే విద్యార్థులకు సులువుగా అర్థం అవుతాయి. కొందరు సైన్స్ టీచర్లు, స్నేహితులు నాకు సహకరిస్తున్నారు.

- టీఎన్ శ్రీధర్,
భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు

కనులపండువగా కల్యాణోత్సవం

» అలంపూర్‌లో వైభవంగా జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి కల్యాణం

» వేలాదిగా తరలివచ్చిన భక్తజనం » వైభవంగా మహాశివరాత్రి వేడుకలు

అలంపూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అలంపూర్ క్షేత్రంలో శివరాత్రి మహోత్సవాలు గురువారం మూడవ రోజుకు చేరుకున్నాయి. తెల్లవారుజామున రెండు గంటలకు ప్రారంభమైన జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి శాంతి కల్యాణ వేడుక నాలుగు గంటలకు ముగిసింది. ఉదయం వాహనసేవ నిర్వహించారు. అనంతరం, ప్రదోశకాలంలో రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ముందుగా ఈవో పురేందర్‌కుమార్, ఆలయ చర్మన్ కొంకల నాగేశ్వర్ రెడ్డి స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. గుమ్మడికాయ కొట్టి రథాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత తరతరాలుగా వస్తున్న సంప్రదాయం ప్రకారం గ్రామ పెద్దలు కొత్త ధాన్యాన్ని రథంపై చల్లారు. చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి రథాన్ని ముందుకు కదిలించారు. కార్య క్రమంలో అర్చకుడు ఆనందశర్మ, పాలక మండలి సభ్యులు బి.గోపాల్, అడ్డాకుల రాము, నాగశిరోమణి తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ వేడుకలో భాగంగా మాంగల్యాన్ని భక్తులకు చూపుతున్న అర్చకుడు

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

» అప్పుల బాధతో యువకుడు » ప్రేమ విఫలమై మరొకరు

» కోర్టు కేసు నేపథ్యంలో మరో వ్యక్తి..

గద్వాల/ రాజోలి/ కోస్గి రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లాలో వేర్వేరు చోట్ల ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండల పరిధిలోని అనంతపురం గ్రామంలో ఎరుకలి పరశురాముడు (24) అనే యువకుడు అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎరుకలి పరశురాముడు ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కుటుంబ అవసరాల కోసం అప్పులు చేశాడు. వీటిని ఎలా తీర్చాలో అర్థం కాక మనోవేదనకు గురయ్యాడు. బుధవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన, గురువారం గ్రామ సమీపంలోని డంపింగ్ యార్డులో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. తండ్రి ఎల్లప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

● జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండల కేంద్రానికి చెందిన మంగలి బేబి కుమారుడు మంగళి నరేశ్ (20) తాగుడుకు బానిసై జులాయిగా తిరిగేవాడు. వృత్తి రీత్యా తల్లి అతడికి సెలూన్ షాపు పెట్టించినా పట్టించుకోలేదు. అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమించాడు. ఆమె అంగీకరించక పోవడంతో మనస్తాపం చెంది బుధవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు సాయంత్రం మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు రాజోలి ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు. నరేశ్ తండ్రి నాగరాజు ఎనిమిది సంవత్సరాల క్రితం మరణించాడు. కుమారుడి మరణంతో బేబి ఒంటరై పోయిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

● నారాయణపేట జిల్లా, కోస్గి మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో గురువారం ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహ్మదాబాద్ మండలం తిరుమలగిరి గ్రామానికి చెందిన దండు వెంకటయ్య (48) హైదరాబాద్‌లో రోజువారి కూలీ పనులు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆయనపై శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో రేప్ కేసు నమోదు కావడంతో, ఆరు నెలలు జైలులో ఉండి బెయిలుపై విడుదలయ్యాడు. అప్పటి నుంచి పోతిరెడ్డిపల్లిలో ఉంటున్నాడు. వచ్చే నెల ఆరున కోర్టుకు హాజరు కావలసి ఉంది. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన భార్య దండు వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

రాజాపూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, రాజాపూర్ మండలంలోని మల్లేపల్లి గ్రామ పంచాయతీ, తిమ్మారెడ్డికుంట తండాకు చెందిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తండాకు చెందిన తార్య (40) మంగళవారం శివరాత్రి సందర్భంగా రామేశ్వరం వెళ్తున్నట్లు చెప్పి, అత్త గారి గ్రామం బాలానగర్ మండలం, గుండేడు గ్రామానికి వెళ్లాడు. బుధవారం ఉదయం అక్కడి నుంచి రామేశ్వరం వెళ్తుండగా ఫిట్స్ వచ్చాయి. దీంతో తిరిగి గుండేడుకు వెళ్లాడు. అక్కడ మళ్లీ ఫిట్స్ రావడంతో 108 అంబులెన్స్‌లో జడ్చర్ల ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తన కుమారుడి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ తల్లి సభావత్ గమిళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

కృష్ణ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం లేని, అంధుడైన బాలుడు పొరపాటున పురుగుల మందు తాగి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. నారాయణపేట జిల్లా, కృష్ణ మండల పరిధిలోని గుడెబల్లూరు గ్రామానికి చెందిన జి.నరేశ్ (14)కు మతి స్థిమితం లేదు. కళ్లు కూడా లేకపోవడంతో మూడు రోజుల క్రితం పొరపాటున పురుగుల మందు తాగాడు. గమనించిన తల్లిదండ్రులు అతడిని కర్ణాటక రాష్ట్రం, రాయచూరు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సురేంద్ర తెలిపారు.

లభించని విద్యార్థి ఆచూకీ

» గుండాల అంబా రామలింగేశ్వరస్వామి ఆలయం కోనేరులో గల్లంతు

» రెండు రోజులుగా గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు



కోనేరులోకి దిగుతున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందం సభ్యుడు

వెల్దండ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండలంలోని గుండాల అంబారామలింగేశ్వరస్వామి ఆలయ కోనేరులో గల్లంతైన ఇంటర్ విద్యార్థి పెరుమాళ్ల ఓమేష్ (17) ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. కల్వకుర్తి జేపీ నగర్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న ఓమేష్ మహాశివరాత్రి సందర్భంగా బుధవారం స్నేహితులతో కలిసి అంబారామలింగేశ్వరస్వామి దేవాలయానికి వెళ్లాడు. స్నానం చేసేందుకు అక్కడి కోనేరులో దిగిన విద్యార్థి ఈత రాకపోవడంతో నీళ్లలో మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు స్థానికులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం రాత్రంతా మోటార్ల సహాయంతో నీటిని తోడినా ఫలితం దక్కలేదు. దీంతో వారు ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందికి సమాచారం అందించారు. గురువారం మధ్యాహ్నం 20 మంది సభ్యులున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందం ప్రత్యేకమైన క్రేన్ సహాయంతో కోనేరులోకి దిగింది. కోనేరులో నీరు అయిపోయి తేలిన బురదలో గాలించినా ఓమేష్ జాడ తెలియరాలేదు. సాయంత్రం వరకు ప్రయత్నించిన బృందం సభ్యులు చీకటి పడడంతో గాలింపు నిలిపివేశారు. తిరిగి శనివారం ఉదయం గాలిస్తామని తెలిపారు. విద్యార్థి తల్లిదండ్రులు పెరుమాళ్ల రాములు, లక్ష్మిలు సంఘటన స్థలంలో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అదనపు కలెక్టర్ అమరేందర్ సంఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని తెలుసుకున్నారు. విద్యార్థి గల్లంతైన విషయం తెలుసుకున్న స్థానికులు అధికసంఖ్యలో కోనేరు వద్దకు చేరుకున్నారు. సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ కురుమూర్తిలు ప్రత్యేక పోలీసు బృందంతో బందోబస్తు ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, రాష్ట్ర ఫుడ్‌కమీషన్ చైర్మెన్ గోలి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి గాలింపు చర్యలను పరిశీలించారు. సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతో మాట్లాడి పరిస్థితి ఆరా తీశారు. విద్యార్థి తల్లిదండ్రులు లక్ష్మి, రాములును ఓదార్చారు. సంఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని, బాధిత కుటుంబానికి రెండుకోట్ల రూపాయల ఎక్స్‌గ్రేషియా, కుటుంబం లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారి వెంట కల్వకుర్తి మునిసిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు విజితారెడ్డి, మాజీ ఎంపీపీ పుట్ల రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్యగౌడ్, మధుసూదన్‌రెడ్డి, శేఖర్, విజయ్‌గౌడ్, చంద్రమోహన్‌రెడ్డి ఉన్నారు.

ఏటా మూడు పంటలు సాగు చేయొచ్చు

» చతుర్విధ జల ప్రక్రియతో అది సాధ్యం » మర్రి చెన్నారెడ్డి ట్రస్టు కార్యదర్శి మర్రి శశిధర్‌రెడ్డి



సదస్సులో పాల్గొన్న మర్రిశశిధర్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ, మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : చతుర్విధ జల ప్రక్రియతో ఏటా మూడు పంటలను సాగు చేయొచ్చని మర్రి చెన్నారెడ్డి ట్రస్టు కార్యదర్శి మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. ఈ ప్రక్రియపై మర్రి చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో నారాయణపేట పట్టణంలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ పాత పద్ధతిలో కాకుండా హన్మంతరావు చతుర్విధ జల ప్రక్రియతో రైతులు ఏటా మూడు పంటలను పండిచ్చుకోవచ్చన్నారు. ఈ ప్రక్రియతో రాజస్థాన్ రాష్ట్రంలోని 33 జిల్లాల్లో మంచి ఫలితాలు వచ్చాయని తెలిపారు. మొదట సంగారెడ్డి జిల్లా గొట్టిగారిపల్లెలో 2004లో ఈ ప్రయోగం చేసిన తరువాత, ఎంత కరువు వచ్చినా నేటికి నీరు సమృద్ధిగా ఉందని తెలిపారు. ప్రభుత్వాలు ప్రాజెక్టులకు లక్షల కోట్ల రూపాయలను ఖర్చు చేసే కన్నా, ఈ ప్రక్రియను అమలు చేస్తే ప్రతీ రైతు మంచి పంటలు పండించుకోవచ్చన్నారు. నారాయణపేట జిల్లాలో వాటర్ షెడ్ కార్యక్రమాన్ని అమలు చేస్తే ఎకరానికి రూ. 15వేల ఖర్చు అవుతుందని, దాదాపు మూడు లక్షల ఎకరాల్లో చతుర్విధ జల ప్రక్రియను అమలు చేస్తే దాదాపు రూ.450 కోట్లు మాత్రమే ఖర్చు అవుతుందని తెలిపారు. ప్రధాన లిఫ్ట్ ప్రాజెక్టు ఖర్చుతో పోలిస్తే ఇది రెండు శాతం మాత్రమే నన్నారు. దీనిపై ఇక్కడున్న ప్రజా ప్రతినిధులు స్పందించాలని, రైతులకు అవగాహన కల్పించి జిల్లాలో చతుర్విధ జల ప్రక్రియ అమలయ్యేలా చూడాలని కోరారు. ఈ ప్రక్రియతో ఏడారి ప్రాంతంలో కూడా పంటలు పండిస్తున్నామని రాజస్థాన్ రివర్ బోర్డు అథారిటీ ఇంజనీర్ శుక్లా వివరించారు. కార్యక్రమంలో పర్యావరణ వేత్త పురుషోత్తం రెడ్డి, వాటర్ షెడ్ నిపుణులు అఫ్సర్, ఇస్రో ఇంజనీర్ సురేశ్, నాబార్డ్ అధికారి శణ్ముఖాచారి, సుదర్శన్‌రెడ్డి, సదాశివరెడ్డి, సత్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'పాలమూరు - రంగారెడ్డి'

పూర్తయ్యే దాకా పోరాటం

» పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాఘవాచారి

వనపర్తి రూరల్, ఫిబ్రవరి 27, ఆంధ్రజ్యోతి : పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి, ఉమ్మడి పాలమూరు ప్రాంతానికి నిరంతరం నీరు పారేంత వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి అన్నారు. వనపర్తి పట్టణంలోని పాలమూరు అధ్యయన వేదిక వనపర్తి జిల్లా కన్వీనర్ వెంకటేశ్ నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 15, 16 సంవత్సరాలు పోరాడితే పాలమూరు - రంగారెడ్డి పథకం మంజూరయ్యిందని తెలిపారు. ఆ పథకం పూర్తయి ఉంటే ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని గద్వాల్, అలంపూర్ మినహా 12 నియోజకవర్గాలకు సమృద్ధిగా సాగునీరు అందేదని తెలిపారు. సకాలంలో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయితే 2017లోనే సాగునీరు అందేదని, కానీ గత కేసీఆర్ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. జూరాల వరద నుంచి తీసుకోవాల్సిన నీటిని, శ్రీశైలం ప్రాజెక్టు నిల్వ నీటికి మార్చారన్నారు. అది రెండు రాష్ట్రాల మధ్య ఉండటంతో వివాదంగా మారిందని ఆరోపించారు. కృష్ణానది నీటిని తీసుకెళ్లేందుకు ఎగువ నున్న కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో సౌకర్యాలు ఉండడంతో ఆర్‌డీఎస్ నుంచి సాగర్ కుడి కాలువ వరకు ప్రకాశం బ్యారేజ్ నుంచి అన్ని నీళ్లు తీసుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. నిజాయితీగా పని చేసే ఏ పార్టీ కూడా ఇప్పటి వరకు రాలేదని, పార్టీలను పక్కకి పెట్టి పాలమూరు, రంగారెడ్డి ప్రజలకు న్యాయం చేసే దిశగా అడుగులు వేయాలని డిమాండ్ చేశారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తయ్యేంత వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కోకన్వీనర్ శాంతన్న, నాయకులు నారాయణ, యూసుఫ్, వేణు గోపాల్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నాం

● అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పి.అరుణ



కృష్ణ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, ఐదేళ్లలోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పౌష్టికాహారం అందించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పి.అరుణ అన్నారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు ఎలాంటి పౌష్టికాహారం అందిస్తున్నారు?

కేంద్రాల్లో గర్భిణులకు సంపూర్ణ భోజనంతో పాటు, కోడిగుడ్లు, 200 ఎంఎల్ పాలు ఇస్తున్నాం.

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందడం లేదని ఆరోపణలు వస్తున్నాయి?

అలాంటిదేమీ లేదు. మెనూ ప్రకారం గర్భిణులకు ప్రతీవారం క్రమం తప్పకుండా కోడిగుడ్లు, అరటిపండ్లు, పౌష్టికాహారం అందిస్తున్నాం.

కొన్ని కేంద్రాలకు టీచర్లు వెళ్లకుండా ఆయాల ద్వారా నడుస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.?

ప్రతీ అంగన్‌వాడీలు టీచర్లతోనే నడుస్తున్నాయి. టీచర్ లేని కేంద్రాలను ఆయాలు నడిపిస్తున్నారు.

మండలంలో ఎన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎంత మంది పిల్లలు ఉన్నారు.?

మండలంలో మొత్తం 33 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఏడు నెలల నుంచి మొత్తం 1110 మంది పిల్లలు, మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 818 మంది ఉన్నారు.

న్యూస్ బాక్స్

జాతీయ స్థాయి క్రీడలకు విద్యార్థి ఎంపిక



పరశురాంకు ట్రోఫీ అందజేస్తున్న పీఈటీల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలం

కృష్ణ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత జనవరి 7న హైదరాబాద్ దోమలగూడ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి సీనియర్ షూటింగ్ బాల్ ఎంపికలో ముడుమాల్ గ్రామానికి చెందిన పరశురాములు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.గోపాలం గురువారం తెలిపారు. పరశురాములు ఈనెల 28 నుంచి మార్చి 3 వరకు నల్గొండ జిల్లా కేంద్రంలో జరిగే జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొంటారని వారన్నారు. అదేవిధంగా ఈనెల 9న మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో 10 కి.మీ మట్టి రోడ్డుపై జరిగిన మౌంటెన్ సైక్లింగ్ పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. మార్చి 7 నుంచి 9 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడల్లో పరశురాములు పాల్గొంటారని పీఈటీ మీనాకుమారి తెలిపారు.

ఘనంగా రామలింగేశ్వర స్వామి ఉత్సవాలు

కోస్గి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కోస్గి మండలం పీసీ తండాలోని రామలింగేశ్వర స్వామి జాతర ఘనంగా కొనసాగుతోంది. ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాల్లో నారాయణపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డితో పాటు నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో మార్పు

నారాయణపేటటౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని అంజనా గార్డెన్‌లో సాయి జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు యూత్ ఫెస్ట్ పేరిట వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ హరినారాయణభట్టడ్ మాట్లాడారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల యాజమాన్యం జనార్దన్‌రెడ్డి, శంకర్, శశికుమార్, రఘుపతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలి

ధన్వాడ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించి క్రమశిక్షణ అలవర్చుకోవాలని షీ టీమ్స్ పోలీసు చెన్నయ్య అన్నారు. మండల కేంద్రంలోని భారతి విద్యానికేతన్‌లో గురువారం షీ టీమ్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, పోలీసులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోస్గి రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. గురువారం మండలంలోని ముశ్రీఫా వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపారు.



మక్తల్‌లోని మల్లికార్జునస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శివపార్వతుల కల్యాణం



కోస్గి మండలం నాగసాన్‌పల్లి శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా శివపార్వతుల కల్యాణం

మక్తల్/మక్తల్ రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా మక్తల్ పట్టణంలోని మల్లికార్జునస్వామి దేవాలయంతో పాటు, పరిధిలోని వల్లభాపురం శ్రీదత్త పీఠంలో గురువారం శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. మల్లికార్జునస్వామి ఆలయ ఆవరణలో బాల్రెడ్ శివకుమార్, బాల్రెడ్ జయంతి, బాల్రెడ్ పావని, బాల్రెడ్ మల్లికార్జున్ దంపతుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం జరిగింది. అంతకుముందు మక్తల్ పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఉత్సవమూర్తి విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద వేద మంత్రోచ్ఛరణల మధ్య అంగరంగ వైభవంగా శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు తిప్పయ్యస్వామి, మిఠాయి రమేష్, బట్టి మహదేవ్ తదితరులున్నారు.

అదేవిధంగా, మక్తల్ మండలం వల్లభాపురం శ్రీదత్త పీఠంలో ఆలయ పూజారి రఘు శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. 28న రేణుక మాతకు బోనాల సమర్పణ ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని శ్రీదత్త పీఠం ట్రస్టు కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో మాతా నిరంజన్ ఆనంద సరస్వతి, మాజీ ఎంపీపీ వనజ, పసుపుల మాజీ సర్పంచు దత్తు, చిట్యాల లక్ష్మణ్, ప్రతాప్‌రెడ్డి, వన్నవాడ శ్రీకాంత్, భక్తులు పాల్గొన్నారు.

శివాలయాల్లో అన్నదానాల జోరు

నారాయణపేట/కోస్గి : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా శివాలయాల్లో గురువారం అన్నదానాల జోరు కొనసాగింది. జిల్లా కేంద్రంలోని శ్రీలక్ష్మీ గణపతి ఉమా మహేశ్వర దేవాలయంలో మహా గణపతి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దిలీప్ కుమార్ దీక్షిత్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. అలాగే బారంబావి మనోహరేశ్వర, మోచివాడ, లింగేశ్వరస్వామి, మహంకాళీ, మాతా మాణికేశ్వరి వ్యాసాశ్రమంతో పాటు పలు శివాలయాల్లో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మహా శివరాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదానాలు చేపట్టారు. అంతకుముందు ఆయా ఆలయాల్లోని శివలింగాలకు అభిషేకం, పుష్పాలంకరణ, మహా మంగళ హారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉపవాస దీక్షలను విరమించారు.

అదేవిధంగా, కోస్గి మండలం నాగసాన్‌పల్లి గ్రామ శివారులో ఉన్న గుట్టపై నెలకొన్న శివాలయంలో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రతీ సంవత్సరం శివరాత్రి జాగరణ మరుసటిరోజు ఈ ఆలయంలో ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అన్నదాన కార్యక్రమంలో నిర్వాహకులు బాల్‌రాజ్, నారాయణ, కృష్ణయ్య, వెంకట్‌రాములు, బాలు, బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌నర్సిములు, కోనేరు సాయిరెడ్డి, హన్మంతు, చెన్నయ్య, వెంకట్‌రాములు ఉన్నారు.



పల్లలో అన్నదానం నిర్వహిస్తున్న మహా గణపతి ఫౌండేషన్ సభ్యులు

సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలు శిశుమందిరాలు

» మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

నారాయణపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు శిశుమందిరాలు నిలయాలని, మానవీయ విలువలతో కూడిన సంస్కారవంతమైన విద్యను అందిస్తు విద్యార్థులను చక్కగా తీర్చిదిద్దుతున్నాయని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. గురువారం రాత్రి నారాయణపేట శిశుమందిర్ 48వ వార్షికోత్సవ సభకు రతంగ్‌పాండురెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ డీకే అరుణ ప్రసంగించారు. భారతీయ జ్ఞానపరంపరతో కూడిన భారతీయ కేంద్రీయ విద్యను, బాలికలకు కర్రసాము చేయడం, సాంస్కృత కళలు నేర్పుతున్న ఆచార్యులను అభినందించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి పటేల్ శ్రీనివాస్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, కుంటి ఎల్లప్ప, బాల్‌రాజ్, దూస సీతారాములు, రాఘవేందర్‌రెడ్డి, లక్ష్మయ్యగౌడ్, ప్రసాద్‌శెట్టి, కుర్మయ్య, కృష్ణయ్య, దత్తుచౌదరి తదితరులున్నారు.



శిశుమందిర్‌లో ధ్యానం చేస్తున్న డీకే అరుణ

బాలకేంద్రాన్ని బాలభవన్‌గా అప్‌గ్రేడ్ చేయాలి

గత 40 ఏళ్లుగా చిన్నారులకు వివిధ కళాంశాలలో శిక్షణ నిస్తున్న నారాయణపేట బాలకేంద్రాన్ని బాలభవన్‌గా అప్‌గ్రేడ్ చేయాలని గురువారం నారాయణపేటలో ఎంపీ డీకే అరుణకు బాలకేంద్ర సిబ్బంది వినతిపత్రం సమర్పించారు. సిబ్బంది జీతాలు తక్కువగా ఉన్నాయని జీతాలు పెంచాలన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు రతంగ్‌పాండురెడ్డి, బాలకేంద్రం సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి, సంగ నర్సింలు, వసంత్‌కుమార్ తదితరులున్నారు.

నర్సరీలో మొక్కలు రక్షించాలి

» ఎంపీడీవో రహమతుద్దీన్

కృష్ణ/మాగనూరు ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రతీ నర్సరీలో మొక్కలను వేసవి నుంచి కాపాడుకోవాలని ఎంపీడీవో రహమతుద్దీన్ అన్నారు. గురువారం మాగనూరు మండలం అమ్మపల్లి గ్రామ నర్సరీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో గ్రామాల్లోని నర్సరీలో పెంచుతున్న మొక్కలను కాపాడాలని వాటికి సమయానికి నీరు పోయాలని, ఎండ తగలకుండా గ్రీన్‌నెట్ వేయాలని, పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. మొక్కలను రక్షించే బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, మేటీలపై ఉందన్నారు. నర్సరీలో మొక్కలు ఎండిపోయినా, చనిపోయిన సమాచారాన్ని జిల్లా శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. లేకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో నిబంధనలు పాటించాలి

» ఎంపీడీవో నర్సింహారెడ్డి

మద్దూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో నిబంధనలు పాటించాలని ఎంపీడీవో నర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని హన్మానాయక్ తండాలో పైలెట్ ప్రాజెక్టు కింద మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి హౌసింగ్ అధికారులతో కలిసి ఆయన మార్కింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎల్-1కింద ఎంపికైన లబ్ధిదారులు సర్వే సందర్భంగా తమకు చూపించిన స్థలంలోనే ఇంటి నిర్మాణం చేపట్టాలన్నారు.

హోరెత్తించిన ఎడ్లబండ్ల లాగుడు పోటీలు

ఊట్కూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రతీ సంవత్సరం మాదిరిగానే శివరాత్రి అనంతరం మండలంలోని చిన్నపొర్ల గ్రామంలో శివస్వాముల ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం ఎడ్లబండి లాగుడు పోటీలు జరిగాయి. పోటీలను తిలకించడానికి వందలాది మంది తరలివచ్చారు. ధన్వాడ, నర్వ, మక్తల్, ఊట్కూర్, మాగనూర్ మండలాలతో పాటు సరిహద్దులోని కర్ణాటక గ్రామాల నుంచి వచ్చిన ఎద్దుల పోటీల్లో పాల్గొని తమ శక్తిని ప్రదర్శించాయి. ఈ పోటీల్లో పాల్గొనే ఎద్దులు పది నిమిషాల వ్యవధిలో బిర్రు బండిని ఎంత దూరం లాగితే వారే విజేతలని నిర్వాహకులు నిబంధన పెట్టగా దానికి అనుగుణంగా ఎద్దులు పోటీల్లో పాల్గొన్నాయి. అనంతరం మొదటి బహుమతి గజలపోల్ల లింగంకు రూ.5 వేలు, రెండవ బహుమతి కర్లెపోల్ల శివరాజ్‌కు రూ.4 వేలు, మూడవ బహుమతి రాంచంద్రికి రూ.3 వేల నగదును నిర్వాహకులు అందించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు మెంబర్ సంజప్ప, కర్లెపోల్ల చిన్న నర్సిములు, ఎద్దుల నర్సిములు, దొబ్బలి నర్సిములు, కోట్ల గోపాల్, దొబ్బలి హన్మంతు, రామకృష్ణ, బాపురం నర్సిములు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ధన్వాడలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం

» కార్యాలయానికే పరిమితమైన కల్యాణలక్ష్మి ఫైల్స్

» ఎమ్మెల్యే ఓకే చేసినా.. ఆర్డీవో కార్యాలయానికి చేరుకోని వైనం

ధన్వాడ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో కల్యాణలక్ష్మి ఫైళ్లు తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నాయి. ఫైళ్లలన్నింటిని ఎమ్మెల్యే పరిశీలించిన అనంతరం ఆర్డీవో కార్యాలయానికి పంపించాల్సి ఉండగా తహసీల్‌లోనే అవి ఓ మూలన పడ్డాయి. పేదింట్లో పెళ్లి చేసిన తల్లిదండ్రులు ఎన్నో వ్యయప్రయాసాల కోర్చి పెళ్లికి సంబంధించిన అన్ని పత్రాలను జత చేసి రెవెన్యూ కార్యాలయంలో అప్పగిస్తారు. సంబంధిత శాఖ అధికారులు పంచనామా అనంతరం ఎమ్మెల్యేతో నోటిఫై చేయిస్తారు. ఆ తర్వాత వీటిని ఆర్డీవో కార్యాలయానికి చేర్చాల్సిన అధికారులు వాటిని ఓ మూలకు పడేశారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో పేదింటి ఆడబిడ్డలకు ఈ పథకం డబ్బులు రావాలంటే ఏడాది గడిచిపోతోందని బాధితులు విమర్శిస్తున్నారు. ధన్వాడ మండలానికి సంబంధించి దాదాపు 50 కల్యాణలక్ష్మి ఫైళ్లు రెవెన్యూ కార్యాలయంలో ఉండిపోయాయి. 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో కల్యాణలక్ష్మి ఫైల్స్‌పై తహసీల్దార్ సింధూజతో ఆరా తీయగా ఆమె సెక్షన్ అధికారిని పిలిపించి మండిపడ్డారు. ఫైళ్లలన్నింటిని వెంటనే ఆర్డీవో కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు.

నేడు డయల్ యువర్ డీఎం

నారాయణపేట న్యూటౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నారాయణపేట, కోస్గి ఆర్టీసీ డిపోల పరిధిలో ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నామని డిపో మేనేజర్ లావణ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు 7382826293 నెంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

మక్తల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహిళా సమాఖ్య ద్వారా తీసుకున్న రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ విజయ్‌కుమార్ అన్నారు. మహిళా అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా మండల మహిళా సమాఖ్య భవనం వద్ద ఆయన మహిళలతో మాట్లాడారు. మహిళలు అక్షరాస్యతతో పాటు ఆర్థికంగా బలోపేతం అయితేనే కుటుంబం సాఫీగా సాగుతుందన్నారు. రుణాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు సంపాదించిన డబ్బులను సురక్షితమైన పొదుపు మార్గాల్లో ఉంచుకొని కుటుంబ అవసరాలను తీర్చుకోవాలన్నారు. మహిళలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత వివరాలను ఇతరులకు వెల్లడించొద్దన్నారు. భవిష్యత్ భద్రత కోసం బీమా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రసన్నకుమార్, కవిత తదితరులున్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం

ఊట్కూర్ ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడుగుర్తి గ్రామ వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని స్థానిక ఎస్సై కృష్ణంరాజు ప్రారంభించారు. మహబూబ్‌నగర్‌కు చెందిన వైద్య బృందం ఆధ్వర్యంలో రక్తదాన నిధిని సేకరించారు. శిబిరంలో 40 మంది యువకులు తమ రక్తాన్ని దానం చేశారు. సమాజ సేవలో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు వీరరాఘవరెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణార్జున్‌రెడ్డి, నిర్వాహకులు చంద్రశేఖర్‌రెడ్డి, కండక్టర్ రాజు, గౌరీశంకర్, రామాంజనేయులు, మోహన్, రవి, కె.శివ, గ్రామ యువకులు పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

మరికల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 33 జిల్లాల్లో నిర్మాణ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులందరికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ పేట జిల్లా అధ్యక్షుడు సురిటి గోపి, కార్యదర్శి కురుమన్నలు అన్నారు. గురువారం మరికల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తాపీ, ఇటుక, కంకర, సెంట్రింగ్, పెయింటింగ్, ఎలక్ట్రిషన్, వడ్రంగి తదితర పనులు చేసి 60 సంవత్సరాలు దాటిన కార్మికులకు పెన్షన్‌తో పాటు అన్ని సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏప్రిల్‌లో జరిగే రాష్ట్ర మహాసభలో భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతో పాటు భవిష్యత్ కార్యాచరణపై తీర్మానాలు చేస్తామన్నారు. ఏప్రిల్ 21, 22న జరిగే మహాసభలను జయప్రదం చేయాలని వారు కార్మికులను కోరారు.

ఆజాద్ చంద్రశేఖర్ అడుగుజాడల్లో నడవాలి



మక్తల్‌లో ఆజాద్ చంద్రశేఖర్ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

» ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్/ఊట్కూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): యువకులు ఆజాద్ చంద్రశేఖర్ అడుగుజాడల్లో నడవాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం మక్తల్ పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు ఆజాద్ చంద్రశేఖర్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వ్యక్తుల్లో గొప్ప మహనీయుడు ఆజాద్ చంద్రశేఖర్ అన్నారు. 25వ ఏటనే తన ప్రాణాలను బ్రిటీష్ వారికి దొరక్కుండా తనకు తానే కాల్చుకున్న గొప్ప దేశ భక్తుడు అన్నారు. కాంగ్రెస్ నాయకులు రవికుమార్, చంద్రకాంత్ గౌడ్, కట్ట సురేష్‌కుమార్‌గుప్తా, కున్సి నాగేందర్, కల్లూరి గోవర్ధన్, మ్యాదరి శ్రీనివాసులు, మాద్వార్ శంకర్, రంజిత్‌రెడ్డి, శంశొద్దీన్, నిరంజన్ గౌడ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అదేవిధంగా, ఊట్కూర్ మండలం బిజ్వార్ గ్రామంలో పీవైఎల్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో చంద్రశేఖర్ ఆజాద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీ గ్రామ కార్యదర్శి మల్లేష్ మాట్లాడారు. ఆజాద్ పోరాట పటిమను కొనియాడారు. ఆజాద్ వారసత్వాన్ని యువత ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.గోవర్ధన్‌రెడ్డి, ఎల్లప్ప, బి.నరసింహా, తిరుపతి, లొట్టి గోవిందు, ఆశప్ప, అంజప్ప, అనిల్, తిమ్మప్ప తదితరులున్నారు.

బాలాజీ మందిర్ అభివృద్ధికి కృషి

» ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

నారాయణపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలాజీ మందిర్ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి హామీ ఇచ్చారు. గురువారం స్థానిక సీవీఆర్ భవన్‌లో మహేశ్వరి సమాజం సభ్యులు మందిర ప్రాంతంలో ఎలాంటి షాపులు నిర్మించవద్దని, దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగుతుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ దేవాలయం అభివృద్ధి కోసం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తానన్నారు. కార్యక్రమంలో బాల్‌కిషన్‌లాహోటి, బద్రినారాయణ లాహోటి, శ్రీనివాస్ లాహోటి, పవన్‌ధరక్, హరినారాయణభట్టడ్, హనుమాన్, రాజు, పూజా, బబిత తదితరులున్నారు.

కులాంతర వివాహ జంటకు ప్రోత్సాహకం

నారాయణపేట రూరల్ : పేట మండల పరిధిలోని ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన నవనీత, రాజ్‌కుమార్, ఉలిగుండంకు చెందిన ప్రియాంక, హనుమదాస్ కులాంతర వివాహం జరుపుకున్న జంటలకు గురువారం స్థానిక సీవీఆర్ భవన్‌లో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ఒక్కో జంటకు రూ.2.50 లక్షలు ప్రోత్సాహక చెక్కులు అందించారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఉమాపతి ఉన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

» కలెక్టర్ సిక్తాపట్నాయక్

» మిషన్ భగీరథ, బడ్జెట్ పన్నుల వసూళ్లపై అధికారులతో సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేటటౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో మిషన్ భగీరథ, బడ్జెట్ పన్నుల వసూళ్లపై ఆమె అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మిషన్ భగీరథ గురించి మాట్లాడుతూ గ్రామగ్రామాన మిషన్ భగీరథ తాగునీటి సరఫరా అవుతోందని, వేసవిలో కూడా అలాగే సరఫరా చేయాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే తెలుపాలని అధికారులను ఆదేశించారు. వేసవి యాక్షన్ ప్లాన్ ప్రకారం ముందుకు వెళ్లాలని తెలిపారు. నారాయణపేట, మక్తల్, కోస్గి, మద్దూరు మునిసిపల్ కమిషనర్లను ఆయా మునిసిపాలిటీలలో తాగునీటి సరఫరాపై పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే బడ్జెట్ పన్నుల వసూళ్లపై మాట్లాడారు. సమావేశంలో మిషన్ భగీరథ ఈఈ, మిషన్ భగీరథ గ్రిడ్ పి.వెంకటరెడ్డి, మునిసిపల్ కమిషనర్లు, అధికారులు, ఏఈ, డీఈలు పాల్గొన్నారు.

అనుమతి లేని దత్తత చట్టపరమైన నేరం

ధన్వాడ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పిల్లలను అనుమతి లేకుండా దత్తత తీసుకోవడం నేరమని జిల్లా బాలల సంరక్షణ అధికారులు శ్రావన్, సంతోషలు అన్నారు. గురువారం వారు ధన్వాడ మండలంలోని పాతపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఓ కుటుంబంలో వివాహం జరిగి 13 ఏళ్లు అయ్యిందని, దంపతులకు సంతానం కలుగకపోవడంతో వారు గోవా రాష్ట్రానికి వలస వెళ్లారన్నారు. అక్కడ 12 సంవత్సరాల బాలుడు దొరికాడని, ఆ బాలుడికి తల్లిదండ్రులు లేరని తెలుసుకొని తమ బిడ్డగా తెచ్చుకున్నారని వారు వివరించారు. వారం క్రితం ఈ జంట స్వగ్రామానికి తిరిగి రాగా, విషయాన్ని తెలుసుకొని ఆ దంపతుల నుంచి పూర్తి వివరాలు సేకరించామన్నారు. అనుమతులు లేకుండా పిల్లలను ఎవరూ దత్తత తీసుకోవద్దన్నారు. బాలుడిని పేటలోని బాలల సంరక్షణ కేంద్రానికి తరలించామని వారు వివరించారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



మద్దూర్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

మద్దూర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం అల్లీపూర్ పాఠశాలలో తనకు సంబంధం లేని స్కావెంజర్ నిధులు ఇవ్వాలని ఒత్తిడి తెస్తూ పాఠశాల ఎస్ఎంసీ చైర్‌పర్సన్ వెంకటమ్మను కులం పేరుతో దూషించిన గ్రామానికి చెందిన ఎల్లప్పపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం బాధిత పాఠశాల చైర్‌పర్సన్ వెంకటమ్మతో కలిసి మద్దూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఎల్లప్పపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రభుదాస్, చిన్నయ్య, రాజు, అర్జున్, నరేష్, నర్సిములు, ఆంజనేయులు, వెంకటేష్, ప్రవీణ్‌కుమార్, కృష్ణ ఉన్నారు.

కులాల రంగు పులుముకున్న అల్లీపూర్ ఘటన

స్కావెంజర్ నిధుల విషయంలో చోటు చేసుకున్న సంఘటన కులాల మధ్య రంగు పులుముకుంది. అల్లీపూర్ ఘటనపై పోలీసులు తనను పిలిపించి విచక్షణారహితంగా కొట్టారని ఆరోపిస్తూ ఎల్లప్ప కుటుంబ సభ్యులు స్టేషన్ ఎదుట చేసిన ఆందోళనకు బీసీ సంఘాల నాయకులు మద్దతు పలకడమే కాకుండా దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని వారు వివిధ రూపాల్లో డిమాండ్ చేస్తూ వస్తున్నారు. అయితే తనకు సంబంధం లేని స్కావెంజర్ నిధులు ఇవ్వాలని పాఠశాల చైర్‌పర్సన్ వెంకటమ్మను కులం పేరుతో దూషించిన ఎల్లప్పపై చర్యలు తీసుకోవాలని తాజాగా దళిత సంఘాలు ఎదురుదాడికి దిగడం ఈ సంఘటనకు కులాల రంగు పులుముకుంది.

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

కోస్గి రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ అంబులెన్స్‌లో ప్రసవించి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. కోస్గి పట్టణానికి చెందిన ముస్కాన్‌బేగం పురిటినొప్పులతో గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. ఆసుపత్రి సిబ్బంది ఆమెకు అన్ని పరీక్షలు చేశారు. ఇంతలో ఆమెకు బీపీ పెరిగి ఇబ్బంది పడడంతో వైద్యులు ఆమెను తాండూరు ఆసుపత్రికి రెఫర్ చేశారు. 108లో తాండూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. 108 సిబ్బంది తాజుద్దీన్, ఫయాజ్ ఖాన్ సకాలంలో తగిన చర్యలు తీసుకోవడంతో ప్రసవం సజావుగా జరిగిందని ఆమె కుటుంబీకులు తెలిపారు.